
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 45 | సోమవారం 23 మార్చి 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు



- పైప్ గ్యాస్ పై ప్రజల్లో అవగాహనకు కృషి
- అకాల వర్షాలతో పంటనష్టం అంచనాలను ఈనెల 31లోగా పంపాలి
- సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

మధ్యప్రాశ్చ్యంలో యుద్ధవాతావరణ నేపథ్యంలో గ్యాస్ లభ్యతలో అసమానతలు పెరిగాయని అయితే వంట గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఉండవల్లి సిఎం క్యాంప్ - మిగతా3లో



# డీఎంకేదే అధికారం

- తమిళనాడులో డీఎంకే కూటమికి 180 సీట్లు
- అన్నాడీఎంకే అలయెన్స్ 54 స్థానాలకే పరిమితం: లేటెస్ట్ సర్వే
- త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు
- ముమ్మరంగా డీఎంకే, అన్నాడీఎంకే కూటములు, టీవీకే ప్రచారం
- ఈ క్రమంలో విపక్ష అన్నాడీఎంకే కూటమికి షాక్ ఇచ్చిన 'అగ్ని న్యూస్ సర్వీస్' సర్వే

## స్టీల్ పరిశ్రమ ద్వారా లక్ష మంది

# యువతకు ఉద్యోగాలు



- 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ
- అర్సెలార్ మిట్టల్-- నిప్పన్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి


**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అనకాపల్లి**

అర్సెలార్ మిట్టల్-- నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి సమీపంలో రాజయ్య పేటలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సోమవారం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 20 నెలల్లోనే స్పీడ్ - మిగతా3లో



# ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం

- భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి
- యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది
- లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ
- దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని స్పష్టం



## 'ఈ ఏడాది అమెరికాలో జరగబోయే జీ20 సమ్మిట్ వల్ల నో యూజ్'

- పశ్చిమాసియా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 'విశ్వగురు' మోదీ ఎందుకు ప్రయత్నించట్లేదు?
- మిడిల్ ఈస్ట్‌లో అంతకంతకూ ముదురుతున్న యుద్ధం
- అక్కడి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రధాని మోదీ దౌత్యపరమైన చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్, నెతన్యాహులను వ్యతిరేకించడం మోదీకి ఇష్టం లేదని ఎద్దేవా

# నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్



- నెల్లూరు తీరంలోకి తమిళనాడు, పుదుచ్చేరి బోట్లు
- నెల్లూరు జిల్లాలోని సముద్ర తీరంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు
- 12 నాటికల్ మైల్స్ వరకు ఇతర రాష్ట్రాల బోట్లు ప్రవేశించకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి సముద్ర పర్యవేక్షణ బలోపేతానికి నిర్ణయం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

నెల్లూరు జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడు, కారైకల్, పుదుచ్చేరి ప్రాంతాలకు చెందిన అదునాతన బోట్లు వచ్చి మత్స్య సంపదను కొల్లగొట్టుకుని పోతున్నాయి. కొన్నేళ్లుగా ఆంధ్ర రాష్ట్రంలోని తీర ప్రాంత మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై తీరం సరిహద్దులో తరచూ గొడవలు అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. 5 నెలలు కిందట 4 మర బోట్లను నెల్లూరు జిల్లా మత్స్యకారులు పట్టుకుని బందించారు. 2 రోజులు కిందట గుట్టు చప్పుడు కాకుండా తమిళనాడు మత్స్యకారులు తీసుకుని పోయారు. ఈ సమస్య తీరంలో తీవ్ర వివాదంగా మారింది. నెల్లూరు జిల్లా తీరంలో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక - మిగతా3లో



## దేశంలోనే అతిపెద్ద

# స్టీల్ ప్లాంట్

**పరిశ్రమ శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అనకాపల్లి**

అనకాపల్లి సమీపంలో ఏర్పాటవుతున్న స్టీల్ ప్లాంట్ అతిపెద్దదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఆర్సెలార్ మిట్టల్--నిప్పన్ స్టీల్ శంకుస్థాపన అనంతరం ప్రసంగించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయటం సంతోషదాయకం. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో 17.8 మిలియన్ టన్నుల ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ హితమైన అత్యాధునిక స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నందుకు లక్ష్మీనివాస్ మిట్టల్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. పర్యావరణ శాఖ మంత్రిగా ఈ ప్రాజెక్టు అత్యంత తక్కువ ఉద్గారాలతో నిర్మిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను. ఏపీని విశ్వసించి భారీ పెట్టుబడి పెడుతున్నందుకు ప్రత్యేకించి పారిశ్రామిక వేత్త లక్ష్మీనివాస్ మిట్టల్‌కు ధన్యవాదాలు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే దార్శనికమైన వ్యక్తి ఉండాలని ఎన్నికల - మిగతా3లో



## ఇరాన్‌కు కశ్మీరీలు భారీ సాయం

- నగదు, బంగారం, నిత్యావసరాలు విరాళం
- కృతజ్ఞతలు తెలిపిన ఎంబసీ
- యుద్ధంతో ప్రభావితమైన ఇరాన్ ప్రజలకు కశ్మీర్ ప్రజలు సాయం
- నగదు, బంగారు, వెండి వస్తువులను సేకరించి పంపించిన ప్రజలు
- పోస్ట్ చేసిన ఇరాన్ ఎంబసీ

# వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు అంశాలపై దిశానిర్దేశం చేసిన వివరాలను మంత్రి పార్ధసారథి ఏపీ సచివాలయం ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భాంగా మంత్రి మాట్లాడుతూ గ్యాస్ కొరతను అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలైన ఇండక్షన్ స్టవ్ లు, పైప్ లైన్ గ్యాస్ కనెక్షన్లు పెంచడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేంశం చేశారన్నారు. ఇండక్షన్ స్టవ్ లను వాడేలా చేయడం,కంపెనీలు వాటి ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు.పైప్ లైన్ గ్యాస్ సరఫరా విధానాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.పైప్ లైన్ గ్యాస్ కోసం పైప్ లైన్ల ఏర్పాటుకు నిబంధనల పాటిస్తూ 24 గంటల్లో అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారన్నారు. ఎందుకంటే పైప్ లైన్ గ్యాస్ సరఫరాకు తక్కువ వ్యయం అవుతుందని,కాలుష్యం కూడా తగ్గుతుందని, సిలిండర్ గ్యాస్ తో పోల్చితే ధర కూడా తక్కువ ఉంటుందని వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా వంట గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నా మని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా



ఇచ్చారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందుగానే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ద్వారా 57 రకాల అప్డేట్స్ ఇచ్చామని దీంతో రైతులు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడంతో నష్టం తీవ్రత తగ్గిపోయిందని మంత్రి పార్ధసారథి పేర్కొన్నారు.ఉదాహరణకు మిర్చి కళ్లాల్లో ఆరబెట్టిన రైతాంగం మెసేజ్ అలెర్ట్ ల ద్వారా జాగ్రత్తపడి టార్పాలిన్ పట్టాలు కప్పి మిర్చి తడిచిపోకుండా కాపాడుకోగలిగారన్నారు.అలాగే హర్వేస్ట్ కూడా వేగంగా చేసి గోదాములకు సరుకును తరలించడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు.అకాల వర్షాల పంటనష్టం అంచనాలను ఈనెల 26 నాటికి పూర్తి ఆవివరాలను ఈనెల 27 నుండి 29 వరకూ రైతు సేవా కేంద్రాల్లో డిస్ప్లే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.ఈనెల 31 నాటికి పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలక్టర్లను సియం ఆదేశించినట్టు వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధమిక సమాచారం మేరకు 13 వేల మంది వ్యవసాయ రైతులు,1800 మంది ఉద్యానవన రైతులు అకాల వర్షాలతో నష్ట పోయారని తెలుస్తోందని,9981 హెక్టార్లలో వ్యవసాయ,1381 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం జరిగిందన్నారు.పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి పార్ధసారథి స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లకోసం 10 లక్షల వరకు దరఖాస్తులు అందాయని వాటిలో 6.5లక్షల నుండి 7 లక్షల వరకు ధరఖాస్తులు అర్హత కల్గినవిగా అధికారులు గుర్తించారని మంత్రి పార్ధసారథి తెలిపారు.పీఎంఎవై 2.0 పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు.పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పార్ధసారథి తెలిపారు.

# నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

-మొదటిపేజీ తరువాయి

చర్యలు చేపట్టింది. ఇతర రాష్ట్రాల మెకనైజ్డ్ హెవీ ఫిషింగ్ బోట్లు ఆంధ్రప్రదేశ్ తీర జలాల్లో అక్రమంగా ప్రవేశించడం, వాటి వల్ల స్థానిక మత్స్యకారులకు కలుగుతున్న నష్టం, అలాగే శాంతి భద్రత సమస్యలపై ఉన్నత స్థాయి అధికారులు చర్చించారు. మత్స్యకారుల సంక్షేమం, మత్స్య సంపద సంరక్షణ అంశాలపై ఫిషరీస్ శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఎస్పీ అజిత వేజండ్ల తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

శాంతి భద్రతలు సమస్య రాకుండా జిల్లా పోలీస్ శాఖ నుంచి ఎస్పీ అజిత వేజెండ్ల, అడిషనల్ ఎస్పీ సౌజన్య, ఎస్డీపీవో ఘట్టమనేని శ్రీనివాసరావు, డీఎస్పీ అన్నెం శ్రీనివాసరావు పర్యవేక్షణ చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంతంలోని 12 నాటికల్ మైల్స్ (సుమారు 22 కి.మీ) పరిధిలోకి ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం సముద్ర ప్రాంతాల్లో జియో-మార్కింగ్ చేపట్టడం, గుర్తింపు కోసం బోయ్స్ ఏర్పాటు చేయడం, అక్రమంగా ప్రవేశించే బోట్లను గుర్తించి తక్షణమే నిరోధించడం, అవసరమైతే జప్తు చేయడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు.

నైట్ విజన్ డ్రోన్ల సహాయంతో అక్రమ కార్యకలాపాలను గుర్తించడం, రాష్ట్ర సముద్ర తీర సరిహద్దుల్లోనే అక్రమంగా ప్రవేశించే హెవీ ఫిషింగ్ బోట్లను అడ్డుకుంటామని అధికారులు తెలిపారు. మెరైన్ పోలీస్, రెవెన్యూ, ఫిషరీస్, ఫారెస్ట్ శాఖలు, స్థానిక పోలీస్ శాఖ, మత్స్యకారుల సముదాయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి సముద్ర



పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.

సముద్రంలో ట్రయల్ రన్: అంతే కాకుండా ఈమేరకు మత్స్య శాఖ రాష్ట్ర కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సముద్రంలో ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. తమిళనాడుకు చెందిన ఓ బోటును కూడా అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ కె. శాంతి, కావలి డీఎస్పీ శ్రీధర్, మెరైన్ డీఎస్పీ బాలరెడ్డి, సీఐలు పాపారావు, రాజేశ్వరరావు, శేషయ్య, బోగోలు ఇన్‌ఛార్జి తహసీల్దారు లక్ష్మీనారాయణ, బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**మాయంపై పోలీసులు కేసు నమోదు:**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో 4 బోట్లు మాయమైన ఘటనపై ఆదివారం బిట్రగుంట ఎస్సై నక్కా ప్రభాకర్ కేసు నమోదు చేశారు. కోవూరు ఫిషరీస్ ఎఫ్‌డీవో సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. బోట్ల యజమానులు, తస్కరణకు సహకరించిన వారిపైనా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# చంద్రబాబును బుక్ చేసిన చిరంజీవి

**విజయవాడ** : తెలంగాణలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో మెగాస్టార్ చిరంజీవిచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అనవసరంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారా? అని అనిపించేలా ఉన్నాయి. ఆయనకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ఇచ్చారు. అయితే చిరంజీవి నందమూరి తారక రామారావు గురించి ఒక్క ప్రస్తావన కూడా చేయలేదు. ఆయన పేరుతో అవార్డు తీసుకున్నందుకు ఒకటి రెండు మాటలు అయినా చెప్పి ఉండాల్సింది. కానీ ఎందుకో చిరంజీవి ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురాలేదు. సహజంగానే ఏదైనా అవార్డులు ఎవరి పేరు మీద అయినా తీసుకుంటే వారి గురించి ప్రస్తావించడం అనేది ముఖ్యం. కానీ ఎందుకో చిరంజీవి ఆ విషయంలో పొరపాటు చేసినట్టు కనిపించారు. అయితే వెంటనే దానిని సరిదిద్దుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు తీసుకోవడం పై ట్వీట్ చేశారు. ఆయన పేరుతో అవార్డు తీసుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు.అయితే అదే వేదికపై పక్క రాష్ట్రం అని ఏపీని ఉద్దేశించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆంధ్రప్రదేశ్ను పక్క రాష్ట్రం తో పోల్చడం ఏమిటని విమర్శలు వచ్చాయి. తెలంగాణ వేదికగా ఏపీ పక్క రాష్ట్రం కావచ్చు కానీ.. సాటి తెలుగు రాష్ట్రం. అందున సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా ఆ మాట అనకూడదు. మరోవైపు కళారంగాన్ని ఆదరించడం, సినీ పరిశ్రమను ప్రోత్సహించడంలో పక్క రాష్ట్రం వెనుకంజలో ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంటే నంది అవార్డులను ఇవ్వాలన్నది చిరంజీవి అభిమతం గా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి..తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కన ఉండగానే ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు చిరంజీవి. నంది అవార్డులను పునరుద్ధరించే విషయంలో చంద్రబాబు ఒక ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చంద్రబాబు నంది అవార్డులను నిలిపివేశారన్న అభిప్రాయం వచ్చేలా చిరంజీవి వ్యాఖ్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకుంటూ వస్తుందనలో సందేహం లేదు. అందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించిన పూర్తి



వ్యవహారాలన్నీ పవన్ కళ్యాణ్ చూస్తారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆ ఇద్దరికీ చెబితే ఇట్టే పని జరిగిపోతుంది. కానీ చిరంజీవి మాత్రం చంద్రబాబు ప్రస్తావన తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. అనవసరంగా చంద్రబాబును ఇందులో ఇన్వాల్వ్ చేయడం ఏమిటనేది ఒక ప్రశ్న. ఏపీలో నంది అవార్డులను నిలిపివేసింది జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి తెలుగుదేశం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డులను ఇచ్చింది. అయితే 2017లో మొత్తం నాలుగు సంవత్సరాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేశారు. కానీ ఆ సమయంలో సొంతవారికి అవార్డులు ఇచ్చుకున్నారు అన్న విమర్శలు వచ్చాయి. ఇదే సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు విమర్శలు చేశారు.. అటు తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డులను పూర్తిగా ఇవ్వలేదు. కానీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కనీసం నోరు తెరవలేదు. పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఎవరు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవలేదు. అటువంటప్పుడు నంది అవార్డుల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూసి మాట్లాడడం ఏమిటనేది ప్రశ్న.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం విషయంలో సినీ పరిశ్రమ ఒకలా ఉంటుంది. ఏపీ ప్రభుత్వం విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల ఆస్తులు, పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం విషయంలో భయము ఉంటుంది. కానీ ఏపీ మాత్రం కేవలం ప్రేక్షక వర్గానితోపాటు వీక్షక వర్గానికి మాత్రమే పరిమితం అయింది. కేవలం ఆదాయం ఇస్తుందే తప్ప సినీ పరిశ్రమ పెద్దలకు ఇక్కడ ఆస్తులు లేవు. అందుకే ఏపీ ప్రభుత్వం పై నోరు మెదిపే సినీ పరిశ్రమ వ్యక్తులు.. తెలంగాణ ప్రభుత్వం పై మాత్రం చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు. అయితే చిరంజీవి చివరిగా ఒక మాట చెప్పారు. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తేనే జీడీపీ పెరుగుతుందనేది చిరంజీవి వాదన. కానీ ఒక చిన్న పరిశ్రమ ఏడాది లావాదేవీలకు కూడా చిత్ర పరిశ్రమ సాటి రాదు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వేలాదిమందికి ఉపాధినిస్తుంది ఓకే. సంప్రదాయ సాంస్కృతిక రంగం సినిమా. అంతవరకు ఓకే కానీ.. రాష్ట్ర అభివృద్ధిలో కీలకం అన్న విషయం మాత్రం ఉత్తమాటే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ ఒక్కటే. నంది అవార్డుల పేరిట ఉన్న దానిని మార్చి గద్దర్ పేరిట ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం ఇస్తే ఆ అవార్డులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. బహుశా ఏపీ ప్రభుత్వం ఆ ఆలోచనతోనే నంది అవార్డులను పునరుద్ధరించలేదు. కానీ చిరంజీవి వేదికపై యధాలపంగా మాట్లాడిన వ్యాఖ్యలు ఇంతటి దుమారానికి దారి తీయడం మాత్రం ఆందోళన కలిగిస్తోం

## స్టీల్ పరిశ్రమ ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగాలు

-మొదటిపేజీ తరువాయిలఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్-- నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును సాకారం చేసి చూపించాం. ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రాజెక్టు సాకారం కావటంలో కషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారాలోకేష్‌ను అభినందిస్తున్నా. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. అనకాపల్లిలో కేవలం స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదు..స్టీల్ సిటీకి శంకుస్థాపన జరిగింది. ఈ స్టీల్ ప్లాంట్ తో పాటు 11,198కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతుంది. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నెస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నెస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు. ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి. ఇంత వేగంగా పరిశ్రమకు భూసేకరణ, అనుమతులు ఇచ్చింది దేశంలో ఒక్క ఏపీలోనే. దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం. టూరిజం నుంచి డేడా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అందరికీ పిలుపునిస్తున్నాను. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి. బీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లో రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ మారుతుంది. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం ఇస్తాం. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలని కోరుతున్నాను. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నాను. ఆవిష్కరణల కోసం ఈ మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

## దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్

-మొదటిపేజీ తరువాయి

ముందు కోరుకున్నాను. ఏపీకి పెట్టుబడులు రావాలంటే చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న, విలువలు ఉన్న రాజకీయ నాయకుడు ఉండాలి. గతంలో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెనక్కు వెళ్లిపోయాయి. కానీ ఇప్పుడు అవి వెతుక్కుంటూ వస్తున్నాయి. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. కేవలం విజనరీ నేత చంద్రబాబు ఉండటం వల్లే సాధ్యం అవుతోంది. రాష్ట్రాన్ని సమర్ధంగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.

## జనసేనలో అరవ రచ్చ

**కడప** : జనసేన పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జనసేన అధిష్టానానికి, స్థానిక నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేయాలని చూస్తుంటే, పార్టీలోని అంతర్గత విభేదాలు మాత్రం తీవ్రమవుతున్నాయి. తాజాగా అరవ శ్రీధర్ వ్యవహారం పార్టీలో సెగలు రేపుతోంది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. త్రిసభ్య కమిటీని కూడా వేసి విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆయనపై కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇక చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయన మళ్ళీ పార్టీ జెండాతో కార్యక్రమాలు నిర్వహించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ పరంగా ఆయన దూరంగా ఉండాలని అధిష్టానం చెప్పినా, శ్రీధర్ మాత్రం క్షేత్రస్థాయిలో జనసేన జెండాతో పర్యటనలు చేయడం స్థానిక నేతలను అయోమయంలో పడేస్తోంది.అరవ శ్రీధర్ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సమాంతర వ్యవస్థగా మారిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇది కేడర్ మధ్య చీలికకు దారితీస్తోందని అధిష్టానానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడం, ఇటీవల జరిగిన కొన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో అరవ శ్రీధర్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇప్పటికే కొంతమంది నేతలు ఆయనను హెచ్చరించినట్లు తెలుస్తోంది.పార్టీ నుండి ఎలాంటి పిలుపు లేకపోయినా, కీలక నాయకులు పాల్గొనే సభల్లో, కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షం కావడం స్థానిక నేతలకు ఇబ్బందిగా మారింది. జనసేనను ఇరుకున పెట్టడానికి వైసిపి వంటి ప్రత్యర్థి పార్టీలకు అరవ శ్రీధర్ వ్యవహారం ఒక ఆయుధంగా మారింది. ఒకవైపు క్లీన్ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న జనసేనకు, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తుల వల్ల కలిగే డ్యామేజ్ తక్కువేమీ కాదు.

## తిరుమలలో క్రెడిట్ వార్

**తిరుమల** : తిరుమలలో తాజాగా ప్రారంభమైన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' క్రెడిట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ ల్యాబ్ ఏర్పాటు తన చొరవతోనే జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 'క్రెడిట్ చోరీ' చేయడంలో చంద్రబాబు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది.జగన్ హయాంలోనే పునాది: గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తిరుమల నాణ్యతా ప్రమాణాల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఈూాంఎకి ప్రతిపాదనలు పంపినట్లు వైఎస్సార్‌సీపీ తెలిపింది.ఆగస్టు 2023లోనే ప్రకటన: దీనికి సంబంధించి ఆగస్టు 2023లో ఈూాంఎ సీఈఓ కమలవర్ధన్ రావు టీటీడీ అధికారులతో సమావేశమయ్యారని, ఆ రోజే ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేస్తూ ఒక వీడియోను విడుదల చేసింది.ట్విట్టర్ వేదికగా విమర్శలు: గత ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వైసీపీ ట్వీట్ చేసింది.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో, అత్యాధునిక పరికరాలతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించగా, ఇది తమ హయాంలోనే మంజూరైన ప్రాజెక్టు అని వైసీపీ ఆధారాలతో సహా వాదిస్తోంది.

## కొత్త జిల్లాల వారీగా జడ్పీలకు రంగం సిద్ధం

**విజయవాడ** : ఆంధ్రప్రదేశ్‌లో పాలనా వికేంద్రీకరణ దిశగా మరో కీలక అడుగు పడబోతోంది. కేవలం రెవెన్యూ జిల్లాలకే పరిమితం కాకుండా, స్థానిక సంస్థల పరిధిలోనూ సమూల మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్తుల పునర్విభజన ప్రక్రియ ద్వారా గ్రామీణ పాలనను మరింత ప్రజలకు చేరువ చేసేందుకు రంగం సిద్ధమైంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చినప్పుడు, అది కేవలం రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికే పరిమితమైంది. కానీ, క్షేత్రస్థాయిలో నిధుల మంజూరు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషించే జిల్లా పరిషత్తులు మాత్రం పాత 13 జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి మారబోతోంది.

# ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలి అనే లక్ష్యంతో SIR పనిచేస్తుంది-ఎస్ఆర్ రాష్ట్ర కన్వీనర్




– రాజమహేంద్రవరంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి కార్యాలయంలో "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" (SIR) జిల్లా కార్యశాల లో పాల్గొన్న ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 23:** ఈ సందర్భంగా ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్,అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ 2026 జరుగుతోంది. 2025లో భారతదేశంలో 11 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సంవత్సరం 22 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది.కొంతమంది ప్రతిపక్ష నాయకులు దీనిపై పలు విమర్శలు చేస్తా ఉన్నారు. ఇదేదో భారతీయ జనతా పార్టీని ఎన్నికల్లో గెలిపించడం కోసం చేపట్టారని, భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని విమర్శించడం జరుగుతోంది. ముఖ్యంగా అవగాహన రాహిత్యంతో కొంతమంది కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు. వారు ప్రతిపక్షపాత్ర కూడా పనికిరాని వ్యక్తులు. కార్పొరేటర్ కి ఎక్కువ ప్రతిపక్ష నాయకులకు తక్కువ స్థాయిలో ఉన్నవారు ఈ విమర్శలు చేస్తున్నారు. 1952 నుంచి ఇప్పటివరకు అనేకసార్లు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిగింది. 11 సార్లు ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించుకోవడం జరిగింది. ఇది 2002- 2005లో చివరిసారిగా జరిగింది. ఆనాటి నుండి దాదాపు 20 సంవత్సరాలు పాటు ఈ కార్యక్రమం నిర్వహించబడలేదు. మరలా ఇప్పుడు నిర్వహిస్తున్నారు. ఒక్క భారతీయ జనతా పార్టీ ఏ కాదు అన్ని పార్టీలు ఇందులో భాగస్వాములే. ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంటు ని నియమించాలి. వారందరి సమక్షంలో ఈఆర్వోలు, బిఎల్వోలు గాని సమీక్ష నిర్వహించి ఈ సవరణ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈరోజు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. SIR ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించి ఈ వంద రోజులు అందరినీ చైతన్య పరచడం కోసం ఒక కార్యాచరణ రూపొందించుకోవడం జరిగింది. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,తూర్పుగోదావరి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు,SIR రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిటిషన్లు చట్టపరిధిలో పరిష్కరించండి

– జిల్లా ఎస్పీ పి.జగదీష్
– జిల్లా పోలీస్ శాఖ కు 111 పిటీషన్లు స్వీకరణ
– పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ జగదీష్




**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం మార్చి 23 :**అనంతపురం జిల్లా పోలీస్ శాఖ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు చట్టపరిధిలో వెంటనే పరిష్కారం చూపాలని ప్రజలకు న్యాయం చేయాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఈరోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (PGRS) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా…ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అనంతపురం మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.ఐ



# వైసీపీప్రభుత్వం లో పేదల ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూములను డంపింగ్ యార్డ్‌గా మార్చిన కూటమి ప్రభుత్వం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 23:** బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు మండలం నవబు పేట గ్రామంలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, అన్యాయ విధానాలపై వైసీపీ నేతలు,గ్రామస్థులు, మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సుమారు 72 మందికి ఇంటి స్థలాలుకేటాయించగా, ప్రస్తుతం ఆ భూములను డంపింగ్ యార్డ్‌గా ఉపయోగించడం పేదలపై జరిగిన పెద్ద అన్యాయమని విమర్శించారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆలమూరు మండల వైసీపీ కన్వీనర్ తమన శీను ఆధ్వర్యంలో నవాబు పేట సర్పంచ్ సురేఖ,రాష్ట్ర మేధావుల ఫోరం వర్గం కార్యదర్శి హరీష్,చల్లా సుబ్బయ్య,గోపు నాగేశ్వర రావు,గుత్తుల లక్ష్మణ రావు,కంపంశెట్టి శ్రీనివాస్,సింగం శెట్టి లలిత దేవి, వార్డ్ మెంబర్లు, రాష్ట్ర తదితరులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదల కోసం కేటాయించిన భూములను చెత్త మైదానాలుగా మార్చడం దారుణమని, ఇది పేదల గౌరవాన్ని తుంగలో తొక్కినట్టేనని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పక్కనబెట్టి, వారి హక్కులను హరిస్తూ అన్యాయ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆ భూములను శుభ్రపరచి, అసలైన లబ్ధిదారులకు అప్పగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ ఘటన పేదల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, ప్రజలు దీన్ని గమనించి తగిన నిర్ణయం తీసుకోవాలని వైసీపీ నేతలు పిలుపునిచ్చారు.




## ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు



**అంకుశం న్యూస్ అనంతపురం, మార్చి 23 :** అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ సామాజిక సంస్కర్త, శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ రామసుబ్బారెడ్డి, జిల్లా పర్యాటక అధికారి జయకుమార్ బాబు, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను గుర్తించి ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతోందన్నారు. భారత స్వాతంత్ర సంగ్రామంలో జాతీయోద్ధరణకు తన వంతు ప్రయత్నంగా శెట్టిబలిజలతో ఒక సైన్యం తయారు చేశారని, అదే ఉద్యమాన్ని స్వదేశమందు ప్రవేశపెట్టారన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత, ఆత్మగౌరవం పెంపొందించడానికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దొమ్మేటి వెంకటరెడ్డి గాంధీ కన్నా ముందే వయోజన విద్యను చేపట్టారని, దూరదృష్టితో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ జర్నలిస్టుగాఎంపికైన శ్రీనివాసరెడ్డి కి ప్రముఖుల అభినందనలు






**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 23:** సీనియర్ పాత్రికేయుడు, అనపర్తి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు కర్రి శ్రీనివాసరెడ్డిని ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేసినట్లు ప్రజాపత్రిక గౌరవ సంపాదకుడు సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరెడ్డి పాత్రికేయ వృత్తిలో చూపిస్తున్న ప్రతిభ నైపుణ్యాలను ప్రశంసిస్తూ,ప్రోత్సహిస్తూ ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈనెల 29న రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో జరిగే ప్రజా పత్రిక 99 వ వార్షికోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులు చేతుల మీదుగా శ్రీనివాసరెడ్డికి పురస్కారాన్ని అందిస్తామని సుదర్శన్ తెలిపారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత డి. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే వార్షికోత్సవ సభకు అనేకమంది ప్రముఖులు విశిష్ట అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. వారిలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి కాశీం, 20 లక్షల పుస్తకాలు సేకరించి ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న మైసూర్ కు చెందిన అంకె గౌడ, ఢిల్లీ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ జె.లక్ష్మీరెడ్డి, ప్రముఖ హేతువాది ఇనాక మురళీధర్, కడప సి పి బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు శ్రీ జానమద్ది విజయభాస్కర్, 196 దేశాలు చూసి వచ్చిన ప్రపంచ పర్యాటకురాలు, బాట్మింటన్ జాతీయ క్రీడాకారిణి డాక్టర్ నర్మదా రెడ్డి, మోటారు సైకిల్ పై భారత దేశాన్ని చుట్టివచ్చి, ప్రధాని నరేంద్ర మోడీ చే ప్రశంసింప బడిన ప్రముఖ జర్నలిస్ట్ శ్రీ ఎల్. ఎన్ ఆర్," ప్రాణహిత " కవి సన్నిధానం నరసింహ శర్మ, తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నట్లు సుదర్శన్ తెలిపారు.

## విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ కు ఘనంగా నివాళులు



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 23:** స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ధర్మవరం పట్టణంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సకల రాజ, సిపిఐ పట్టణ కార్యదర్శి రవి సహాయ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు..... ఈదేశం కోసం త్యాగం చేసిన విప్లవ వీరుడు భగత్ సింగ్ సేవలు మరువలేనిది అన్నారు

# సూర్య కిరణాల తేజస్సులో విరాజిల్లిన శ్రీ కోదండరాముడు

**అంకుశం న్యూస్ తిరుపతి మార్చి 23:** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిచారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**మార్చి 24న రథోత్సవం :**

శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 7.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 8.30 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

## స్వచ్ఛంద సంస్థలు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి :



– జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల

**అంకుశం న్యూస్ అనంతపురము, మార్చి23:** ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఉయ్యాల వాడ నరసింహా రెడ్డి విగ్రహ సమీపాన చలివేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, అనంతపురము ఆర్డీఓ కేశవ నాయుడు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, తదితరులతో కలిసి సందర్శించి, వారు చలివేంద్రంలోని త్రాగు నీటిని సేవించి రెడ్డి సంఘం వారిని అభినందించి మరిన్ని చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నాయని, ఇది ఆగస్ట్ వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయని, ప్రజల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, తదితరులు ముందుకు వచ్చి అవసరమైన చోటల్లా విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం వారు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి విగ్రహాన్ని సందర్శించారు.

## మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు భాస్కర్ కు ఆర్థిక సహాయం.. సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి.



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 23:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలు క్రియాశీలక సభ్యుడుగా ఉంటూ సంస్థకు ఎంతో సేవలను సభ్యుడు భాస్కర్ (శివ) అందించడం జరిగింది. కానీ శివ భార్యకు ఇటీవలే బత్తలపల్లి ఆర్ డి టి హాస్పిటల్ లో ఆపరేషన్ చేసి, సర్జరీ చేశారు. సమాచారం అందుకున్న మానవతా సంస్థ ట్రస్ట్ కమిటీ వారు వారిని ఆప్యాయంగా పలకరించి, పరామర్శించారు. తదుపరి ఆ కుటుంబానికి సంస్థ తరపున రూ .10,000, వ్యక్తిగత సభ్యుల తరపున రూ.23,000 వెరసి రూ.33,000 అందజేశారు.ట్రస్ట్ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, చిన్న తంబీ చిన్నప్ప, జగ్గా వేణుగోపాల్ మాట్లాడుతూ నిరంతర సేవాభావంతో అనాధ శవాలకు అంత్యక్రియలను నిర్వహించే ఈ దంపతులకు ఆర్థిక ఆత్మీయ సహకారం మా సంస్థ తరపున అందించడం మాకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. ముందు కూడా ఈ కుటుంబానికి మా అండదండలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగ లింగం, గంగాధర్ గుప్తా, ఆంజనేయ చౌదరి, నర్సింహారెడ్డి, బి.రామకృష్ణ ,రాంప్రసాద్, మోహన్ దాస్ ,రమేష్, జింక చిన్నప్ప, ప్రతాపరెడ్డి, టి. రామకృష్ణ, మనోహర్ గుప్తా , చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన-పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 23:** సంక్షేమం,అభివృద్ధి సమన్వయం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి,రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం బిక్కవోలు మండలం మెళ్ళూరు పెద భూలోకం సుందర మాణిక్యం జడ్పీ హైస్కూల్లో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ వాటర్ ప్లాంట్,రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన సైకిల్ షెడ్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.వీటితో పాటు హైస్కూల్ కి రూ.4 లక్షల వ్యయంతో పెయింటింగ్ పనులు పూర్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 2.62కోట్లతో శిల్పారామం వద్ద సీసీ రోడ్డుకు భూమి పూజ

**- 10కోట్లతో పార్కుకు మళ్లీ పూర్వ వైభవం తెస్తామన్న దగ్గుపాటి ప్రసాద్**

**అంకుశం న్యూస్ అనంతపురం మార్చి 23:** వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనంతపురం నేషనల్ పార్కును పీపీపీ మోడల్లో అభివృద్ధి చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగర శివారులోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నేషనల్ పార్కులో 2కోట్ల 62 లక్షలతో సీసీ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శిల్పారామం క్యాలెండర్ ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆవిష్కరించారు. పనులు ప్రారంభించిన అనంతరం ఆయన పార్కు మొత్తం తిరుగుతూ అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పించాలన్న దానిపై ఆరా తీశారు. 2014-19వరకు ఈ పార్కు నగర ప్రజలకు మంచి ఆహ్లాదాన్ని పంచిందన్నారు. సుమారు 76ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులు, ఆట వస్తువులతో ఈ పార్కు అద్భుతంగా ఉండేదన్నారు. ఏ పండుగ వచ్చినా వేలాది మంది వచ్చి ఇక్కడ



పిక్నిక్ స్పాట్ లా గడిపేవారన్నారు. కానీ ఐదేళ్ల వైసీపీలో ఈ పార్కును సర్వనాశనం చేశారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను సైతం లేకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక... ఇక్కడ పార్కుకు పూర్వ వైభవం తెచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. 10కోట్ల రూపాయలతో అంచనాలు సిద్ధం చేశామని.. జిల్లా కలెక్టర్ సహకారంతో తొలి విడుదలతో 2కోట్ల 62లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశామన్నారు. 15లక్షలతో టాయిలెట్స్ నిర్మాణం కూడా చేస్తున్నామన్నారు. కొందరి భాగస్వామ్యంతో



పీపీపీ మోడల్లో వాటర్ థీమ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నెలల్లో ఈ పార్కులో మార్పు చూపిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఈ 20నెలల్లోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో దివాకర్, శిల్పారామం సెక్రటరీ శివ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు డిష్ నాగరాజు, లింగమయ్య స్వామి, డాక్టర్ హరి, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 6.37లక్షల మందికి రుణాలు

**- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు లోక్‌సభలో కేంద్రం సమాధానం**

**- ఏపీలో ధరఖాస్తుల పెరుగుదలకు ఆస్కారం**

**అంకుశం ప్రతినిధి న్యూఢిల్లీ, మార్చి 23::** దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. . ముఖ్యంగా చిన్న తరహా పరిశ్రమలకు ఊరటనిస్తూ, ఎటువంటి పూచీకత్తు (గ్యారెంటీ) లేకుండా ఇచ్చే రుణ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు . ఈ నిబంధన 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని మంత్రి తెలిపారు. లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎంఎస్ఎంఈ పథకాలు, రుణాల వివరాలపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024--25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వారీగా మంజూరైన ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరైన వివరాలను మంత్రి తెలుపుతూ...మహారాష్ట్రలో అత్యధికంగా 15.76 లక్షల మేర పరిశ్రమలకు రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 11.97లక్షలు, పశ్చిమ బెంగాల్ 11.69 లక్షలు, తమిళనాడులో 11.51 లక్షలు, కర్ణాటకలో 9.39 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 6.37లక్షలు, తెలంగాణలో 4.94 లక్షల పరిశ్రమలకు రుణాలను ఇవ్వడం



జరిగిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడచిన ఏడాది 2,36425 మంది రుణాల కోసం ధరఖాస్తులు చేసుకోగా వాటిలో 17667 రుణ ధరఖాస్తులను మాత్రమే తిరస్కరించి మిగిలిన 218758 ధరఖాస్తు దారులైన ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలకు రుణాలను అందించినట్లు వివరించారు.

**ఏపీలో రుణాల జోరు**

కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. కీలక పథకాలు - రాయితీలు ఎంఎస్ఎంఈల కోసం అమలవుతున్న ప్రధాన పథకాలను మంత్రి పంకజ్ చౌదరి వివరించారు.

# అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలి







**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అంకుశం న్యూస్ అనంతపురం, మార్చి 23 :** ప్రతి సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ లకు ఎక్కువ శాతం రెవెన్యూ సంబంధిత శాతం అర్జీలు వస్తున్నాయని, అందులో మండల స్థాయిలో పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ లకు వస్తున్న అర్జీలు, వాటి పరిష్కారంపై ఆర్డీఓ కార్యాలయాల డిఏఓలు, ఆయా మండలాల డిప్యూటీ తహసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, విఆర్వోలతో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతివారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లకు 350 కి పైగా గ్రీవెన్స్ లు మొదటిసారి వస్తున్నాయన్నారు. ఖచ్చితంగా కింది స్థాయిలో డిటి, విఆర్ఓలతో మాట్లాడిన తర్వాతే తమ దగ్గరికి గ్రీవెన్స్ రావాలని, డిటి, విఆర్ఓలతో మాట్లాడకుండా తమ దగ్గరికి గ్రీవెన్స్ రావడానికి వీలులేదన్నారు. అర్జీదారుడుతో డిప్యూటీ తహసిల్దార్, విఆర్వోలు కలసి తమ వద్దకు రావాలన్నారు. ఏ అర్జీ వచ్చిన కింది స్థాయిలో పరిష్కరించగలిగినవి పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్ కు వచ్చిన ఏ అర్జీదారుడైన రిసిప్ట్ లేకుండా వెళ్లకూడదని, తప్పనిసరిగా వారికి రిసిప్ట్ ఇచ్చి పంపించాలన్నారు. మండలాల్లో సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

- ఈ సమావేశంలో పిజిఆర్ఎస్ డిటి జయశ్రీ, డిఏఓలు, ఆయా మండలాల డిప్యూటీ తహసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, విఆర్వోలు పాల్గొన్నారు.

# పిల్లల పౌష్టికాహారంపై గరికపాటి నరసింహారావు వ్యాఖ్యలు విచారకరం

**- జనవిజ్ఞాన వేదిక ఖండన...**

**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 23:** ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు పాఠశాలల్లో పిల్లలకు ఇచ్చే కోడిగుడ్ల గురించి వారికి ఇచ్చే మధ్యాహ్న భోజనం, బ్యాగు, షూస్, యూనిఫారం గురించి చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవి, అమానుషమైనవనీ, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండి, ధర్మ ప్రబోధాలు చేసే వ్యక్తి, పేద పిల్లల ఆకలిని , వారి ప్రాథమిక హక్కులను కించపరిచేలా మాట్లాడటం శోచనీయమని జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గరికపాటికి మన దేశంలో పౌష్టికాహార లోపం వంటి అంశాలు తెలియవో లేక తెలిసి కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేసారో? వాస్తవము ఏమిటంటే భారతదేశంలో నేటికీ దాదాపు 35 నుండి నుండి 40 శాతము మంది పిల్లలు సరైన పౌష్టికాహారం అందక 'స్టంటింగ్' (వయసుకి తగ్గ ఎదుగుదల లేకపోవడం) 'వేస్టింగ్' (బరువు తక్కువగా ఉండటం) వంటి సమస్యలతో బాధపడుతున్నార అని, గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2025 ప్రకారం భారత దేశం 123 దేశాలలో 102 వ స్థానంలో ఆందోళనకరమైన స్థితిలో ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత , పిల్లల హక్కు అన్నారు .దీన్ని హేళన చేయడం అంటే దేశ భవిష్యత్తును అవమానించడమేనన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి మన పొరుగు దేశాలు కూడా ఆకలి సూచీలో మనకంటే మెరుగైన ర్యాంకుల్లో ఉండటం గమనార్హం అన్నారు. కాబట్టి, పిల్లలకు అందించే కోడిగుడ్లు లేదా ఇతర పౌష్టికాహారం అనేది కేవలం ఒక సౌకర్యం కాదు అని, అది వారి ప్రాథమిక , చట్టబద్ధమైన హక్కు, ఆహారపు హక్కు అన్నారు.బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పోషకాలతో కూడిన ఆహారం అందించడం అనేది చట్టబద్ధమైన హక్కు అన్నారు.. ఒక గుడ్డు కోసం పిల్లలు బడికి వస్తున్నారని మాట్లాడటం వారి ఆత్మగౌరవాన్ని



దెబ్బతీయడమేనన్నారు.పిల్లల పట్ల అసభ్యకరలి పోలికలు,పిల్లల ఎదుగుదల గురించి లేదా వారు ఆహారం తీసుకునే విధానం గురించి మాట్లాడుతూ, శోభనం రాత్రి పెళ్ళికొడుకు వంటి అనైతిక ,అసభ్యకరమైన పోలికలు తీసుకురావడం గరికపాటి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పిల్లల మనస్తత్వంపై ,సమాజంపై ఇటువంటి మాటలు అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్నారు.కోడిగుడ్డు ఒక సంపూర్ణ ఆహారం. వైద్య శాస్త్రం ప్రకారం, ఎదుగుతున్న పిల్లలకు ప్రోటీన్లు , విటమిన్లు అందడానికి కోడిగుడ్డు ఒక చౌకైన ,అత్యుత్తమ మార్గమనీ ,దీనిపై వితండవాదం చేయడం వల్ల పేద పిల్లలకు అందే పోషకాలను అడ్డుకున్నట్టే అవుతుందన్నారు.పిల్లల హక్కులను కించపరుస్తూ, వారి పేదరికాన్ని హేళన చేస్తూ మాట్లాడిన గరికపాటి తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన సభకు వెళ్ళే ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 23:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరగనున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (AMNS ) ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన సభకు తరలి వెళ్తున్న కూటమి శ్రేణుల ర్యాలీని పెందుర్తిలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జెండా ఊపి ప్రారంభించారు. భారీగా శ్రేణులు తరలి రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

## దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు



**అంకుశం న్యూస్ పుట్టపర్తి, మార్చి 23:** ప్రముఖ సామాజిక సంస్కర్త, శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ముఖ్యంగా శెట్టిబలిజ సమాజంలో విద్య, ఐక్యత మరియు ఆత్మగౌరవం పెంపొందించడానికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషి చిరస్మరణీయం. శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, వెనుకబడిన వర్గాల సామాజిక అభివృద్ధికి ఆయన పునాదులు వేశారు.ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ గారు పేర్కొన్నారు.మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ విజయసారధి,ఆర్డీఓ సువర్ణ ,డిఆర్డిఎ పిడి నరసయ్య,జిల్లా బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర,జిల్లా అధికారులు పాల్గొన్నారు

## బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని స్కీంకు రూ.11 లక్షలు విరాళం



**అంకుశం న్యూస్ తిరుమల మార్చి 23:** టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ బాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని పథకానికి అహ్మదాబాద్‌కు చెందిన Arihant Dyestuff Private Limited సంస్థ ప్రతినిధులు సోమవారం రూ.11 లక్షల విరాళం అందించారు. పేద రోగులకు వైద్య సేవలకు ఉపయోగించాలనే సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు తిరుపతికి చెందిన శ్రీ వై. రాఘవేంద్ర ఈ విరాళాన్ని అందజేశారు.తిరుపతిలోని పరిపాలన భవనంలోని ఈవో ఛాంబర్ లో టీటీడీ ఈవో శ్రీ ఎం. రవిచంద్ర ను కలిసి రూ.11 లక్షల డీడీని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో దాతలకు ధన్యవాదాలు తెలియజేసి, వారి సేవాభావాన్ని అభినందించారు.

## అనాధ ఆశ్రమం లో గుట్టూరు టీడీపీ నాయకుల అన్నదానం



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 23:** పెనుకొండ గుట్టూరుకు చెందిన టిడిపి నాయకులు రానా ప్రతాప్ రాయల్ తమ సోదరుడు కె. మనోహర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేశారు. పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో చేనేత మంత్రి సవితమ్మ అభిమానులు, టీడీపీ అభిమానులు పవన్ కుమార్, దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.ఆనాధలకు తమ వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు..తమ మిత్రుడికి ఈ సందర్భంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.

## ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి, మార్చి 23:** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ లి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయసారధి,ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 214 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.